రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

బోథ్, జనవరి 4: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డులోని సెయింట్ థామస్ పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ వివిధ రకాల రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పాటించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించారు. నేర్చుకున్న ప్రతి విషయాన్ని తమ తల్లిదండ్రులు, వాహనదారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రాజన్న, రాజేశ్వర్ రెడ్డి, సాయన్న పాల్గొన్నారు.

అడెల్లి రోడ్డు పరిశీలన

బోథ్, జనవరి 4 : బోథ్– నిర్మల్ ప్రాంతాల దూరభారాన్ని తగ్గించేందుకు నిర్మించిన అడెల్లి రోడ్డును శనివారం ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ పరిశీలించారు. ఘాట్ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డును నాయకులతో కలిసి సందర్శించారు. సంబంధిత ఆర్అండ్ బీ రోడ్డు అధికారులు వెంటనే పూర్తయ్యేలా చూడాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోథ్, జనవరి 4: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జోనల్ అధికారి ఫ్లోరెన్స్ రాణి, ప్రిన్సిపాల్ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా ఆరు నుంచి తొమ్మిదో తరగతుల్లో మిగిలిన సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ https:/tgswreis.telangana,https:/they.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బోథ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

బోథ్, జనవరి 4: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయిస్తున్నారు. శనివారం తీసుకువచ్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గద్దెపై కూర్చోబెట్టారు. ఇంస్టాలేషన్ పనులు మొదలు పెట్టారు. సబ్ స్టేషన్ పరిధిలో బోథ్ టౌన్, బోథ్ రూరల్, పాట్నాపూర్, మర్లపల్లి ఫీడర్లు ఉండగా ఒకే 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఓవర్ లోడ్ సమస్య మూలంగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. దీంతో అధికారులు మరో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి బిగించే పనులు చేయిస్తున్నారు. ఏడీఈ లక్ష్మణ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఇంస్టాలేషన్ పనులు పూర్తి చేసి సరఫరాను ప్రారంభిస్తామని ఏడీఈ తెలిపారు.

వ్యాధి నిరోధక టీకా వేయించుకోవాలి

నార్నూర్, జనవరి 4 : గర్భిణులు, పిల్లలు వ్యాధి నిరోధక టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహన్ చరణ్‌దాస్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం రాజుల్‌గూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకా వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శీల, అంగన్‌వాడీ టీచర్ కరిజా, ఆశకార్యకర్త నిర్మల పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన హమాలీల సమ్మె

బోథ్: నినాదాలు చేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీలు

బోథ్, జనవరి 4: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయ్ హమాలీలు చేపట్టిన సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. బోథ్‌లోని పౌర సరఫరాల గోదాం ఎదుట హమాలీలు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు షేక్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జీవో నంబర్ 6 అమలు చేయాలన్నారు. క్వింటాల్‌కు రూ.29 హమాలీ చెల్లించాలన్నారు. ప్రతి కార్మికుడికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఆశన్న, అల్మాస్, ప్రశాంత్, రవి, శేఖర్, లింగన్న, సాయి, మహేశ్ పాల్గొన్నారు

భైంసా, జనవరి 4: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన రేట్ల జీవో అమలు చేయాలని, కార్మికులకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ముత్తన్న, అజామ్ ఖాన్, రాములు, బాబు, సోమేశ్, సత్యపు విఠల్, తదితరులు పాల్గొన్నారు.

భైంసా: నిరవధిక సమ్మెలో పాల్గొన్న హమాలీలు

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

కడెం: మోకాళ్లపై కూర్చోని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

కడెం, జనవరి 4 : పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని పంచాయతీ కార్మికులు కడెం ఎంపీడీవో కార్యాలయం ముందు మోకాళ్లపై నిల్చోని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు గోవింద్‌నాయక్ మాట్లాడుతూ ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని, కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

భైంసా, జనవరి4 : భైంసా మండలంలోని పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న కార్మికులు శనివారం విశ్రాంతి భవనం ఎదుట నిరసన తెలిపారు. తమకు వెంటనే వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆరు నెలలుగా తమకు జీతాలు రాలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాకుండా తినడానికి తిండి లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కావున వేతనాలు అందించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనలో క్రాంతి, లక్ష్మణ్, రవి, గంగాధర్, అమృత్, ప్రకాశ్, సంజీవ్, లింగం, లక్ష్మి పాల్గొన్నారు.

భైంసా: విశ్రాంతి భవనం ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

టోల్‌ప్లాజా కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ పీడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం, జనవరి 4 : నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోని టోల్ ప్లాజాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కోరారు. ఈ విషయమై శనివారం కామారెడ్డిలోని ఎన్‌హెచ్ఏఐ ప్రైమరీ ఇంప్లిమెంటేషన్ యూనిట్‌లో పీడీ శ్రీనివాసరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.50 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, నేరడిగొండ రోల్ మామడ టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్, పిప్పర్‌వాడ టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షుడు సంతోష్, గంజాల్ టోల్ ప్లాజా అధ్యక్షుడు రమేశ్, నాయకులు ప్రశాంత్ ఎస్‌కే అహ్మద్, పురుషోత్తం, భీమేశ్, రమేశ్ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు కూలి బంధు అమలు చేయాలి

ఎదులాపురం, జనవరి 4 : వ్యవసాయ కూలీలకు కూలి బంధు అమలు చేయాలని, విధి విధానాలు ప్రకటించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన చలో కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నెళ్ల స్వామి, నాయకులు ఆశన్న, కిష్టన్న, సురేందర్ పాల్గొన్నారు.

సీడీపీసీ చైర్మన్‌గా కర్రోల్ల బుచ్చయ్య

భైంసా, జనవరి 4: నిర్మల్ జిల్లా భైంసాలోని గోపాల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధిలో సహకారం, సహాయ ప్రణాళికలో భాగంగా సీడీపీసీ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సీడీపీసీ చైర్మన్‌గా కర్రోల్ల బుచ్చయ్య, అధ్యక్షుడిగా డాక్టర్ నగేశ్, ఉపాధ్యక్షులుగా మాధవి, మోసిన్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా మనోజ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా బాజీరావ్ పటేల్, కోశాధికారిగా సంపత్ కుమార్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పుస్తక పఠనంతోనే సంపూర్ణ జ్ఞానం

ఎదులాపురం, జనవరి 4 : పుస్తక పఠనంతోనే సంపూర్ణ జ్ఞానం పొందగలుగుతామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో శ్రీ రామకృష్ణ సేవా సమితి వివేక జాగృతి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ప్రదర్శనలో అందుబాటులో ఉంచిన పుస్తకాలను పరిశీలించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి వకులాభరణం ఆదినాథ్, సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు భూమన్న, కోరెడ్డి లెనిన్, పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్ పటాస్కార్, మయూర్ చందర్, లస్మయ్య, కోటేశ్వరరావు, హన్మాండ్లు పాల్గొన్నారు.

8న మెగా జాబ్‌మేళా

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 4 : నిర్మల్ జిల్లా సత్యసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల, మొదటి అంతస్తు ఇందిరమ్మ మున్సిపల్ కాంప్లెక్స్ బస్టాండ్ దగ్గర ఈ నెల 8వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జే పరశురామ్ తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రాం కొరకు 2023–24 పూర్తి చేసుకున్న, 2025 సంవత్సరంలో పూర్తి చేసుకోబోతున్న వారు ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ, ఒకేషనల్ కంప్యూటర్స్ విద్యార్థులకు మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

సిరికొండకు చేరుకున్న నాగోబా ప్రచార రథం

రాజంపేటకు చేరుకున్న నాగోబా ప్రచార రథం

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 4: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా జాతర సందర్భంగా నాగోబా ప్రచార రథ యాత్ర శనివారం సిరికొండ మండలానికి చేరుకుంది. నాగోబా పూజకు అవసరమయ్యే గంగజలం కోసం కుండల తయారీ కోసం గుగ్గిల స్వామికి చెప్పడం జరిగింది. అక్కడి నుంచి రాజంపేట గ్రామానికి వెళ్తే అక్కడ ఆదివాసులు ఘనంగా ఆహ్వానించారు. అనంతరం గుడిహత్నూర్ మండలం కోలాడి గ్రామానికి బయలుదేరుతున్నట్లు రథ సారథి మెస్రం దాదురావ్, కోసు తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

కుంటాల, జనవరి 4: ఈ నెల 8న నిర్వహించే చలో నిర్మల్ మహా ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధి రాములు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని రాజకమల్ బీడీ కేంద్రంలో బీడీ కార్మికులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీశ్, గంగాధర్, కుంటాల బీడీ ప్యాకర్లు, చిన్నయ్య, నర్సయ్య, రాజు పాల్గొన్నారు.

ముథోల్ అభివృద్ధికి కృషి చేస్తా

ముథోల్, జనవరి 4: ముథోల్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ అన్నారు.శనివారం ముథోల్‌లో మహాలక్ష్మీ ఆలయం నుంచి గాంధీ చౌక్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు ఉన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

నార్నూర్, జనవరి 4 : గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని నార్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రహీంపాషా అన్నారు. ఖైరదాట్వలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దాదిరావ్, నారంజి పటేల్, మడావి తుకారాం, కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చు

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీటీసీ రవీందర్ కుమార్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ శేఖర్

ఎదులాపురం, జనవరి 4 : ప్రయాణ సమయంలో వాహనచోదకులు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా డీటీసీ రవీందర్ కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఆదిలాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణంలో రవాణా శాఖ, దుర్గం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, ఆర్టీసీ ఆర్ఎం సోలోమాన్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ శిబిరంలో పాల్గొని కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. వైద్యులు డ్రైవర్లకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కంటి చూపును రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డీటీవో ఎస్ శ్రీనివాస్, ఎంవీఐలు అశ్వంత్‌కుమార్, అలీ శ్రీనివాస్, ప్రదీప్ కుమార్, కోల రవీందర్, ఏఎంవీఐలు హరింద్ర కుమార్, విజయ్ కుమార్, మోహన్‌గౌడ్, ప్రత్యూష, ఏవో వరలక్ష్మి, కార్యాలయ అధికారి రాథోడ్ జైవంత్ పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడిని జయిస్తాం

ముథోల్, జనవరి 4: విద్యార్థులు ధ్యానం చేయడంతో పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా ఉంటారని డాక్టర్ షరీఫ్ అన్నారు. శనివారం ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సునీల్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్ మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడిటేషన్ వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల ఏకీకృతమవడంతో పాటు ప్రశాంతత కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు మరిన్ని సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో తానూర్ కళాశాల ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్, హార్ట్‌ఫుల్ ట్రైనర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

తలమడుగు, జనవరి 4: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని భరంపూర్ గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శనివారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పరిశీలించారు. సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రాజు మోహన్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

కుంటాల, జనవరి 4: నిర్మల్ జిల్లా కుంటాలలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తుల ప్రాసెస్ వేగవంతంగా అయ్యేటట్లు చూస్తున్నానని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం తులం బంగారం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, మాజీ ఎంపీపీ గజ్జారాం, న్యాయవాదులు జక్కుల గజేందర్, అష్టం నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బదిలీ విషయంలో హెచ్ఎంతో వాగ్వాదం

భైంసా, జనవరి 4: ఓ ఉపాధ్యాయుడు బదిలీ విషయంలో ఓ ఉపాధ్యాయుడు ఓ గెజిటెడ్ హెచ్ఎంతో వాగ్వాదం జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భైంసాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు ఇచ్చోడలో పని చేస్తున్న మరో ఉపాధ్యాయురాలితో పరస్పర బదిలీ కోసం ఒప్పందం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 30న రాత్రి ఓ హోటల్‌లో టీ తాగుతున్న హెచ్ఎం వద్దకు వెళ్లి సంతకం విషయమై ఓ ఉపాధ్యాయ సంఘం నేత ఉపాధ్యాయుడు ఈ విషయమై వాగ్వాదం చేసుకున్నట్లు తెలిసింది. సీసీ టీవీలో రికార్డు కాగా పుటేజీ వీడియో వైరల్‌గా మారింది.

కలిసి కట్టుగా కదిలి.. సైడ్ బర్మ్‌కు మరమ్మతులు చేపట్టి..



బండరాళ్లు వేసి చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపడుతున్న రైతులు

పెంబి, జనవరి 4 : నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని మెరుని పరుపు గ్రామం వద్ద కడెం వాగుపై బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేండ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మించింది. భారీ వర్షాలకు చెక్‌డ్యాం సైడ్ బండ్(మట్టి, బండరాళ్లు) కొట్టుకుపోయింది. దీంతో నీరు వృథాగా పోవడంతో గత యాసంగికి సాగు నీరందక పంటలు వట్టిపోయాయి. చెక్ డ్యాంకు మరమ్మతు చేపట్టి పునరుద్ధరించాలని ఆరు నెలల క్రితం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఇరిగేషన్ ఏఈ ఉదయ్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. కానీ.. ఇప్పటివరకు పట్టించుకోలేదు. గత ఎడాదిలా పంటలు ఎండిపోకుండా ముందు జాగ్రత్తగా పెంబి, పెంబి తండాలకు చెందిన 40 మంది రైతులు చెక్‌డ్యాం ఆయకట్టు రైతులు కలిసి శనివారం బండరాళ్లు వేసి సైడ్ బండ్‌కు మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి చెక్‌డ్యాంను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

ముగ్గుల పోటీలు

నిర్మల్‌అర్బన్: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నిర్మల్ అర్బన్, జనవరి 4: సంక్రాంతి పండుగ నేపథ్యంలో నిర్మల్‌లోని దీక్ష జూనియర్ కళాశాలలో శనివారం ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించడమే లక్ష్యంగా ముగ్గుల పోటీలను విద్యార్థులకు నిర్వహించామన్నారు.అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రమోద్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న పోలీసులు

నిర్మల్ అర్బన్, జనవరి 4: నిర్మల్‌లోని నారాయణ రెడ్డి మార్కెట్‌లో శనివారం తెల్లవారుజామున మ్యాక్స్ మోబైల్ దుకాణం తాళాలు పగులగొట్టి దొంగతనానికి ప్రయత్నం చేస్తున్నాడని గమనించిన వ్యక్తి వెంటనే యజమానికి ఫోన్ చేశాడు. దుకాణ యజమాని వెంటనే డయల్ 100కు సమాచారం అందించగా ఏఎస్సై రాజేశ్ మీనా ఎస్ఐ సందీప్‌కు పెట్రోకార్ సిబ్బందితో తక్షణమే అక్కడికి చేరుకుని దొంగను పట్టుకుని కేసు నమోదు చేశారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి మైనర్ కావడంతో జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టారు. దొంగతనాన్ని నివారించి దొంగను పట్టుకున్న పోలీసులను ఎస్సీ జానకి షర్మిల అభినందించారు.

నేడు కడెం ప్రాజెక్టు నీటి విడుదల

కడెం, జనవరి 4: కడెం ప్రాజెక్టు ద్వారా కింది రైతుల కోసం కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామని ఆయకట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కడెం కుడి, ప్రధాన కాలువతో పాటు, సదర్మాట్ కాలువకు నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు సదర్మాట్, 11 గంటలకు కడెం కాలువల ద్వారా ఖానాపూర్ ఎమ్మెల్యే చేతుల మీదుగా నీటిని విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు, అధికారులు, నాయకులు హాజరుకావాలని వారు సూచించారు.

అక్కకొండ ఆలయ కమిటీ ఎన్నిక

కడెం, జనవరి 4: శ్రీ అక్కకొండ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ కమిటీ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల నుంచి కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా కొప్పుల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా అత్కాపురం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తుడిశెట్టి లక్ష్మీరాజు, కోశాధికారిగా మార్కపు లక్ష్మణ్, 30 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన పూజారులు వంశీ, శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు జగ్గారావు, రాజరమేశ్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింగ్ రమేశ్, రాజిరెడ్డి, దాడిశెట్టి శ్రీనివాస్, నర్సయ్య, కుమ్మరి రమేశ్, ఆర్మూర్ గంగాధర్, రాజ్‌కుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

ఉట్నూర్ రూరల్, జనవరి 4: ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి డీడీ వసంత్‌రావ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నర్సాపూర్(బీ) గ్రామంలోని ఆశ్రమ ఉన్నత బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం డీడీ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

9న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఉట్నూర్, జనవరి 4: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువత పలు ఫార్మా కంపనీలలో జూనియర్ కెమిస్ట్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ కోర్సులు 2023–24 సంవత్సరంలో కెమిస్ట్రీ సబ్జెక్ట్ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో నిర్వహించే జాబ్‌మేళాకు తమ సర్టిఫికెట్లు, ఆధార్, పాన్‌కార్డు, రెండు ఫొటోలు, జిరాక్స్ కాపీలతో రావాలని సూచించారు. ఇతర వివరాలకు టాస్క్ కోఆర్డినేటర్ 9885762227నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, జనవరి 4: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో సీతారాం స్పిన్నర్ కంపనీకి 16 మంది యువతను ఎంపిక చేసిందని పేర్కొన్నారు. వారిని ప్రత